# 2. కైలాసయాత్ర

పాటియాలా సంస్థానాధీశుడైన మహారాజా సర్ భూపేంద్ర సింహజీ వారు ఉత్తర భారత మహారాజులలోకెల్ల సుప్రసిద్ధుడై...

శృంగార పురుషుడుగానే కాక, తత్వవేత్తగా, కవి గాయకపోషకుడుగా సవాలక్ష బిరుదులు సంపాదించుకొని, నిత్యజీవితంలో దేవేంద్రుడి బాబులా సకల వైభోగాల మధ్యా జీవించి...

అంతిమ క్షణాలాసన్నమనగా గుండెజబ్బుతో మంచానపడ్డారు.

మహామహులైన రాచవైద్యులెల్లరూ పెదవి విరువగా – శ్రీవారి మూడువందలమందికి మించిన మహారాణీలూ, రాణులూ, అంతపుర స్త్రీలూ తమ పూజలన్నీ విఫలమైనవని నిరాశచేసుకోగా, జీవితాన్నంతా అమృత భాండంలా అనుభవించిన మహారాజావారు నిర్విచారంగా పుష్పక విమానంకోసం ఎదురు చూడసాగేరు. అలాంటి ఘడియలలో ఓ సుప్రభాతాన...

పులిచర్మం అచ్చాదనంగా, అట్టలుకట్టి తలపై విపరీతంగా పెరిగిపోయిన శిరోజ శిఖరమే కిరీటంగా, రుద్రాక్షలే అలంకారాలుగా గల ఓ దిగంబర మునిపుంగవుడు మహారాజావారి "మోతీబాగ్"లో ప్రత్యక్షమై, అడ్డుపెట్టగల ధైర్యమెవరికీ లేక నివ్వెరపోయి చూస్తూ ఉండగా సరాసరి మహారాజావారి శయ్యవద్దకేగి...

"మహారాజా! నేను హిమాలయాలనుండి వస్తూ ఉన్నాను. నీ

వ్యాధి నయం చేయగల దిగంబర సన్యాసి కాశీ క్షేత్రంలో ఉన్నాడు!" అని తెలవిచ్చి ఎలా వచ్చాడో అలాగే అంతర్ధానమై పోయాడు.

మహారాజావారికి పోతూన్న ప్రాణాలు తిరిగి వచ్చినట్లయినది. తక్షణం దివాన్జీని, ఆస్థాన వైద్యుని, ఆస్థాన జ్యోతిష్కుని పిలిపించి వారికీ విషయం చెప్పి వెంటనే కాశీకివెళ్ళి, ఆ దిగంబర సన్యాసిని ఎలాగైనా పట్టుకుని సగౌరవంగా తోడ్కొని రావలసిందిగా ఆజ్ఞాపించారు.

వారున్నూ వెంటనే బయలుదేరి కాశీ చేరుకుని వేయికళ్ళతో వెదుకసాగేరు.

కాని...

కాశీలో సన్యాసులసంఖ్యాకం. వారిలో అనేక మంది దిగంబర సన్యాసులే.

ఊరూ పేరూలేని వ్యక్తిని ఆ సమూహంలో ఎలా గుర్తించటం?

వారలా రోజులతరబడి గాలించగా, గాలించగా ఓసుదినాన ఓ దిగంబర సన్యాసి వీరికి ఎదురై, మేరు గంభీర స్వరంతో...

"మీరు అన్వేషిస్తూన్న వ్యక్తిని నేనే. మీ మహారాజావారి బ్రతుకును ఆర్పగలవాడనూ, వెలిగించగలవాడనూ కూడా నేనే!" అని ప్రవచించగా...

తాము చెప్పకుండానే తామెవరో ఎందుకు వచ్చామోకూడా చెప్పివేయగలిగిన ఆదిగంబర మహాపురుషుని దివ్యదృష్టికిమూర్ఛపోయినవారై, సాష్టాంగ దండ ప్రమాణాదు లాచరించి...

తమ జన్మ, శ్రీవారి జన్మ కూడా ధన్యమై పోయినవని మహారాజావారికి టెలిగ్రాం పంపించేరు.

పాటియాలాకు ఓ స్పెషల్ ట్రెయిన్ తక్షణం సిద్ధపరుపబడింది. ఆర్గురు శిష్యులతో సహా దిగంబర సన్యాసి పాటియాలాకు హుటాహుటిని వేంచేయగా, రైల్వేస్టేషన్‌లో యువరాజావారూ, మహామంత్రీ. మంత్రులూ, రాజబంధువులూ, రాజోద్యోగులూ ఘనస్వాగతం పలికేరు. స్వామీజీకి సైనిక వందనం సమర్పించ బడింది. మహారాజావారు తన రోల్స్ రాయిస్ కారును పంపి స్వామీజీని సకల రాచమర్యాదలతో తన అతిథి మందిరంలో ప్రవేశపెట్ట వలసిందిగా ఆజ్ఞాపించేరు.

కాని......

స్వామీజీ ఈ వైభోగాలన్నింటినీ తిరస్కరించేరు. ఊరి బయట విశాలంగా ఉన్న ఓ పాడుబడిన భవంతిని ఎన్నుకుని, అందులో విద్యుద్దీపాలుండరాదనీ, తన శిష్యులు తప్ప మరెవరూ ఆ పరిసరాలలో కనుపించ రాదనీ ఆజ్ఞాపించేరు.

ఆ సాయంత్రం అనుమతి రాగా మహారాజావారు తన నలభై మంది మహారాణులూ, రాణులూ వెంట రాగా స్వామీజీని దర్శించుకుని కానుకలుగా కనక, మణి, రత్నహారాదులనేకం భక్తి పూర్వకంగా సమర్పించుకున్నారు. అవిగాక మహారాజావారు ప్రత్యేకంగా అక్షరాలా లక్షాఇరవై ఒక్కవేల రూపాయల నగదును శ్రీవారి పాదసన్నిధిని సమర్పించేరు. అలాగే మహా రాణులూ తమ తమ హోదాల ననుసరించి పదివేలనుండి అయిదు వందల రూపాయలవరకూ వేర్వేరుగా స్వాములవారికి చదివించుకున్నారు.

కాని, దిగంబర స్వాములవారా కానుకలన్నింటినీ తృణీకరించేరు. ''సర్వసంగ పరిత్యాగులమైన మాకివన్నీ అనవసరం. వీటిని బీద సాద లకు పంచి పెట్టించటమే మాకు తృప్తినీయగలదు.'' అని సెలవివ్వగా వారి ఆదేశం తక్షణం అమలు పరచబడింది.

తత్ఫలితంగా స్వామీజీపట్ల వారెల్లరికీ గల భక్తి, విశ్వాసాలు తక్షణం వందల రెట్లుగా పెరిగిపోయేయి.

దాదాపు నూర్గురు కూర్చోదగిన ఆ హాలులో అప్పటివరకూ అందరూ నిలబడే ఉన్నారు. స్వామీజీ మాత్రమే పులి చర్మంపై ఆశీనులై ఉన్నారు. హాలులో అక్కడక్కడా ప్రమిదలు మాత్రమే వెలుగుతూ ఉన్నాయి. స్వామీజీ ఆ గుడ్డి వెలుతుర్లో దివ్యతేజస్సుతో వెలిగి పోతూన్న ట్లుగా అందరూ భ్రమించిపోయేరు.

స్వామీజీ అనుమతినీయగా మహారాణులూ, రాణులూ, మంత్రులూ అందరూ కటిక నేలమీదనే కూర్చుని ముకుళిత హస్తులైనారు. మహారాజా వారికి మాత్రం పులి చర్మం చూపబడగా వారాశీనులై స్వామీజీకి పాదాభి వందన మాచరించేరు.

మహారాజావారి శిరస్సుపై తమ దివ్య హస్తాన్నుంచి స్వామీజీ ఇలా సెలవిచ్చేరు.

"నేనిపుడే, మీ సమక్షంలోనే, మీరందరూ చూస్తుండగా, హిమాల యాలకేగి, మీకై మా గురూజీ గోరఖ్‌నాధ్ ఆశీస్సులు తేనున్నాను. వాటి మహిమవల్ల మీరు సంపూర్ణారోగ్యవంతులు కాగలరు—"

అని స్వామిజీ సమాధిలోకి వెళ్లిపోయేరు. శిష్యులు అందరినీ ఎడంగా కూర్చోబెట్టేరు. ఆ హాలంతా నిశ్శబ్దమై పోయింది. లోకాన్ని చీకట్లా వరించుకున్నాయి. స్వాములవారి శిష్యులు తప్ప ఆ చుట్టుప్రక్కల మరే ప్రాణీ కదలటమే లేదు. అలాంటి వాతావరణంలో మహారాజావారూ, మహారాణులూ, రాణులూ, మంత్రులూ ఊపిరి కూడా నిశ్శబ్దంగా వదు లుతూ దిగంబర సన్యాసినే తిలకిస్తూండగా——

స్వాములవారు కూర్చున్న చోటునుండి విమానపు ఇంజన్ స్టార్ట యిన చప్పుడు మొదలై, పెద్దది గావటం, విమానం బయలుదేరిన ధ్వని గావటం, సరిగా ఆదేక్షణంలో స్వామిజీ ఉన్న పళంగా పులి చర్మ సహితంగా క్రమ క్రమంగా గాలిలోకి పైకి లేస్తూండటం, క్షణాలలో వారలా పైకిలేచి పైకప్పుదాకా చేరగానే అదృశ్యులైపోవటం. విమానం దూరంగా వెళ్ళిపోయిన ధ్వని వినరావటం అన్నీ కళ్ళముందే జరిగిపోయేయి.

ఆ అపూర్వ సంఘటనకు ఆ హాలులోని మహామహులంతా సంభ్రమాశ్చర్య భయ, గౌరవాలతో గడ గడ లాడిపోతూ సాష్టాంగ పడిపోయేరు.

స్వామీజీ సమాద్యవస్థలో హిమాలయాలకు వేంచేశారనీ, మరుక్షణంలో వారు గురు గోరఖ్‌నాథ్ దర్శనం చేసుకుని సంభాషించటాన్ని కూడా గమనించవచ్చుననీ శిష్యులు వివరించేరు.

ఆ విమానం అలా ఎంతో దూరంవెళ్ళి ఆగిపోయిన ధ్వని వినవచ్చింది. రకరకాల మృగనాదాలు వినవచ్చేయి. ఆ వెంటనే స్వామీజీ గురు గోరఖ్‌నాథ్‌కు ప్రణామా లాచరించటాన్ని హాలులోనివారంతా అస్పష్టంగా వినగలిగేరు.

"గురూజీ, మీకూ, మీ ద్వారా ఆ పరాత్పరునికీ ప్రణామాలర్పించుకునేందుకై ఈ భక్తుడువచ్చి ఉన్నాడు. పేదలను సాకుతూ, భక్తులను పోషిస్తూన్న మహారాజా భూపేంద్రసింగ్ ఆయురారోగ్యాలను రక్షించవలసిందిగా కూడా ఈ శిష్యుని విన్నపం." అని స్వాములవారనటం...

"నీ కోరిక నెరవేరుగాక" అని గురూజీ సెలవివ్వటం కూడా ఆ హాలులోని వారంతా అస్పష్టంగానైనా వినగలిగేరు. ఆ సంభాషణ మైళ్ళ

దూరంనుండి వస్తూన్నట్లు స్పష్టంగా తెలుస్తూనే ఉన్నది.

మరుక్షణంలోనే దూరాన విమానం బయలుదేరి క్రమంగా దగ్గరకు రావటాన్ని అందరూ గుర్తించేరు. ఆ వెంటనే దిగంబర స్వాములవారు పైకప్పును చీల్చుకుంటూ సమాధ్యవస్థలోనే క్రిందికి యధాస్థానం చేరుకున్నారు

విభ్రములై ఉన్న మహారాజా వారు స్వాములవారి పాదపద్మాలను ముద్దిడుకోగా శ్రీవారు ఆయురారోగ్యాభివృద్ధి రస్తుగా దీవించి సెలవిచ్చి అందరినీ పంపివేశారు.

అంతకు ముందే దిగంబర స్వాములవారి అజ్ఞానుసారం పంచిపెట్ట బడిన లక్షలాది విలువైన కానుకలు గాక మహారాజావారు మరల కొంత ప్రజలకు పంచిపెట్టించేరు స్వామీజీని కాశీనుండి తోడ్కొని వచ్చిన వారికి అగ్రహారాలు దానం చేయబడినాయి.

తెల్లవారేసరికి దిగంబర స్వాములవారు శిష్య సహితంగా అదృశ్యులై పోయేరు.

"వచ్చిన కార్యం నెరవేరింది. వెళ్ళిపోయేరు. మహానుభావులెపుడూ అంతే గదా" అని అందరూ చెప్పుకున్నారు.

ఆ ఉదయం దివాన్జీగారు రాచకార్యాలను పర్యవేక్షిస్తూండగా, ఆస్థాన రక్షక దళాధికారి స్వయంగా తనరోజువారీ నివేదికను సమర్పించుకున్నాడు.

అందులో ఏమని ఉన్నదంటే......!

దళాధికారి దిగంబర స్వాములవారు పాటియాలాలో అడుగిడిన క్షణాన్నుండీ వారి కెవరికీ తెలియకుండానే వారిని వెన్నంటి ఉన్నాడు. ఆ సాయం సంధ్యవేళ స్వామీజీ హిమాలయ యాత్ర చేసినపుడు తాను

స్వామీజీకి చాలా సమీపంలోనే ఎవరికీ తెలియకుండా ఓ చీకటి గదిలో దాగి ఉన్నాడు. హాలులో కొద్దిపాటి దీపాల వెలుగులో ఎవరూ గుర్తించలేకపోయిన ప్రయాణ తతంగాన్నంతా తాను గుర్తించి ఉన్నాడు.

జరిగిందేమంటే......?

స్వామీజీ శిష్యులు అచ్చం స్వామీజీ ఆకారంలో, సైజుతో ఓ గుడ్డ బొమ్మను తయారుచేసి, విమానధ్వని ఆరంభమై అందరి దృష్టి ధ్వని వచ్చిన పైకప్పు మీదికి తిరిగిన క్షణంలో ఆ మసక చీకటిలో ఎవరూ గుర్తించలేనంత వేగంగా స్వామీజీ వెనక గదిలోకి తప్పుకోగా, ఆ బొమ్మను స్వామీజీ స్థానంలో ఉంచేరు. ముందే చేసుకున్న ఏర్పాట్ల ప్రకారం ఆ బొమ్మను పైకి లాగేరు. ధ్వనులన్నీ అనుభవజ్ఞులైన స్వామీజీ, అతని శిష్యులే సృష్టించేరు. ఆ బొమ్మను తిరిగి దింపగానే మరలా అదే పద్ధతిలో దానిని వెనుక గదిలోకి చేర్చి స్వామీజీ ఆ స్థానంలో ఆశీనులయ్యేరు.

అయితే, అంతా పూర్తయి పొద్దుపోయిన తరువాత తానా రహస్య స్థలంనుండి బయటకు వస్తూండగా, అనుకోకుండా స్వాములవారి శిష్యుడొకడు గమనించేడు.

దాంతో గుట్టు బయట పడిపోయిందని స్వాములవారు తక్షణం అర్ధరాత్రివేళ శిష్య సహితంగా అంతర్ధానమై పోయేరు.

ఆ రిపోర్టు నామూలాగ్రంగా చదువుకుని అప్పటికే ఓ అగ్రహారాన్ని దానంగా పుచ్చుకుని ఉన్న దివాన్జీగారు రక్షక దళాధికారితో...

''ఖబర్దార్ ! ఈ సంగతి బయట పడితే పీకలెగిరి పోతా''యని హెచ్చరించి......

ఆ రిపోర్టును తక్షణం అగ్నిహోత్రుడి కాహుతి గావించేరు.

సరిగా ఆ సాయంత్రమే పుణ్య ఘడియలలో పాటియాలా మహారాజా సర్ భూపేంద్రసింహజీ వారు కైలాస వాసులైనారు.

★